

వైభవంగా సూర్యదేవుని కళ్యాణం

రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చకులు సోమ వారం ఘనంగా చేపట్టారు. 8లో



ఆ గ్రామాలకు కరెంటొచ్చింది...

అర్ల పంచాయితీ శివారు నీలబంద గ్రామానికి విద్యుత్ వెలుగులు అందించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 8లో



బంగారం కోసమే హత్య

తీవ్ర సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. 8లో

న్యూస్‌రీల్

త్వరలో నవోదయం 2.0కు శ్రీకారం

- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్



నర్సీపట్నం : నాటు సారా నిర్మూలనకు త్వరలో నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుడతామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. సుధీర్ తెలిపారు. సోమవారం ఆయన నర్సీపట్నం ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నాటు సారా ప్రభావిత గ్రామాలను గుర్తించే పనిలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. తరువాత దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామన్నారు. సారా రహిత గ్రామాలగా మార్చడమే నవోదయం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నవదోయం విజయవంతం అయ్యేందుకు పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులను సమన్వయంతో ముందుకు వెళ్తామన్నారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడికక్కడ నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నామన్నారు. గీత కులాలకు జిల్లాలో 15 మద్యం దుకాణాలను కేటాయించడం జరిగిందని, ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. గీత కులాల్లో కేటాయించిన సబ్ కులాలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. బెల్టు దుకాణాలు వేలం పాటు నిర్వహిస్తే అటువంటి దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని పలు అంశాలను సీఐ సునీల్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అనకాపల్లి ఏఈఎస్ రాజశేఖర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట: జిల్లా స్థాయి అబాకస్ పోటీలో తాళ్ల పాలెం గాయత్రి హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనకాపల్లిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఈ స్కూలు విద్యార్థులు కె. జోషిత్(3వ తరగతి), జి. జీవన్‌కుమార్(5వ తరగతి) ప్రథమ స్థానంలో నిలవడం ద్వారా అర్హత సాధించారు. ఈ మేరకు ఈ నెల 9న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల కరస్పాండెంట్ ఐ. అప్పారావు, హెచ్ఎం బి.రామ్‌కుమార్, పాఠశాల నిర్వాహకుడు వై.నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

పీచు పరిశ్రమకు గడ్డుకాలం..!

- కొబ్బరి తోటల రైతులకు, వ్యాపారులకు ఆదరవు
- వందలాది మందికి ఉపాధి
- దిగుబడులు తగ్గి నష్టపోతున్న వైనం
- జిల్లాలో 34 పీచు పరిశ్రమలు, 20 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు
- ప్రధానంగా పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో అధికం
- పలు రకాల ఉత్పత్తుల తయారీ, ఎగుమతులు
- అందని ప్రభుత్వ ప్రోత్సాహం

కొబ్బరి పీచు పరిశ్రమలకు ప్రస్తుతం గడ్డు కాలం నడుస్తోంది. కొబ్బరి దిగుబడులు లేక పోవడంతో ముడిసరుకు అందడం లేదు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక నిర్వహణ భారంతో నిర్వాహకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొన్ని చోట్ల పరిశ్రమలు నష్టాలు చవిచూస్తూ మూసేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో వేలాదిమంది కార్మికులకు ఉపాధి కరువవుతోంది.



కొబ్బరి పీచు తయారీ సంస్థలు

సాక్షి, అనకాపల్లి :

జిల్లాలో పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో ఆరు మండలాల పరిధిలో 34 కొబ్బరి పీచు పరిశ్రమలు ఉన్నాయి. వీటిద్వారా వందలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమల ద్వారా ఏటా రూ. కోటి మేర వ్యాపార లావాదేవీలు సాగుతున్నాయి. నెలకు 10 టన్నుల పీచు, తాళ్ల ఉత్పత్తి చేస్తూ పరోక్షంగా 10 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. పీచు పరిశ్రమలకు అవసరమైన కొబ్బరి డొప్పలను స్థానికంగా కొబ్బరి రైతులు, వ్యాపారుల నుంచి పరిశ్రమల నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. ట్రాక్టర్ లోడు రూ.3 వేల నుంచి, రూ.4 వేలు వరకు, లారీ కొబ్బరి డొక్కులు రూ.7వేల నుంచి రూ.8 వేల వరకు చెల్లిస్తారు. కొబ్బరి పీచు తయారీకి కిలోకు రూ.8 వరకు ఖర్చవుతుంది. పరిశ్రమ ద్వారా పీచు ఉత్పత్తి చేయగా మిగిలిన పొట్టును ఇటుకల బట్టీలకు విక్రయిస్తుంటారు. పరిశ్రమ వద్దకు తెచ్చిన డొక్కను పీచుగా మార్చడానికి కనీసం నెల రోజుల వ్యవధి పడుతుంది. ప్రస్తుతం కొబ్బరి దిగుబడులు తగ్గడంతో కిలో ధర రూ.8 మాత్రమే ఉందని రైతులు పేర్కొంటున్నారు. అనకాపల్లి జిల్లాలో 20 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుంది. ఎకరాకు 800 నుంచి 1000 కాయల దిగుబడి వస్తుంది. నల్లు తెగులు పంటతో 400 నుంచి 500కు దిగుబడి పడిపోయింది. జిల్లాలో చిన్నాపెద్ద కలిపి 34 కొబ్బరి పీచు పరిశ్రమలు ఉండగా.. సగటున 350 గ్రాముల బరువు ఉన్న ఎండు కొబ్బరి కాయ నుంచి 80 గ్రాములు పీచు వస్తే.. కొబ్బరి పొట్టు 160 గ్రాముల వరకు వస్తోంది. ఏడాదికి 6 వేల టన్నుల పొట్టు ఉత్పత్తి అవుతోందని అంచనా. అధిక ఈసీ(ఎలక్ట్రో కండక్టివిటీ) ఉన్న కొబ్బరి పొట్టును నేరుగా వినియోగిస్తే మొక్కలు దెబ్బతింటాయి. దీంతో వివిధ పద్ధతులలో ఈసీ శాతం తగ్గించి కంపోస్టుగాను, బ్రిక్స్ రూపంలో తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు. ఈసీ ఎక్కువగా ఉన్న పొట్టును ఇటుక బట్టీలకు టన్ను రూ.2,500 చొప్పున విక్రయిస్తుండగా..తక్కువ ఈసీ ఉన్న పొట్టును టన్ను రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. కొబ్బరి పొట్టు నాణ్యమైన సేంద్రియ ఎరువుగా తయారైతే.. దాని ధర పొట్టు రూపంలో టన్ను రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ధర ఉంది.

వైఎస్సార్ హయాంలో ..

గతంలో 2005 వరకూ కొబ్బరి పరిశ్రమలకు పన్ను చెల్లించేవారు. వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆ పన్ను ఎత్తివేశారు. అప్పటినుంచి పన్ను లేకపోవడం, కొబ్బరి పీచు మార్కెట్ ధర ఎక్కువగా ఉండడంతో పరిశ్రమలు బాగా నడిచాయి. తరువాత కొబ్బరి తొక్క రేట్లు పెరగడం, సిబ్బందికి వేత నాలు పెరగడం, కరెంట్ ఛార్జీలు పెరగడం భారంగా మారింది. ఎస్.రాయవరం మండలం, రాంబిల్లి మండల పరిధిలో 6 పరిశ్రమలు మూతపడ్డాయి. మరో 10 అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.

అనకాపల్లి టూ చైనా..

కొబ్బరి పీచును సోఫా సెట్లు, కార్పెట్లు, పరుపులు, తాళ్లు, తయారు చేయడానికి వినియోగిస్తారు. అలాగే కృత్రిమ బొమ్మలు, ప్లైవుడ్ తయారు చేస్తున్నారు. జిల్లాలో తయారయ్యే కొబ్బరి పీచు నెలకు 200 నుంచి 250 టన్నుల వరకూ చైనా, నేపాల్‌కు ఎగుమతి అవుతుంది. విశాఖ పోర్టు నుంచే ఎగుమతి చేస్తారు. వీటితో పాటుగా 100 టన్నుల వరకూ పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిస్సా రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి.

విద్యుత్ సబ్సిడీ ఇస్తే..

ప్రభుత్వం నుంచి విద్యుత్ సబ్సిడీ, మార్కెట్ సదుపాయం లేదు. నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నారు. సబ్సిడీ ఉంటే కొంత ఊరటగా ఉంటుంది. కొబ్బరి పీచుకు ఫిక్స్‌డ్ మార్కెట్ ధర లేదు. అదేవిధంగా లేబర్ ఖర్చు తగ్గించుకోవడానికి ఎన్ఆర్ఈజీఎస్‌ను అనుసంధానం చేస్తే పరిశ్రమలకు మేలు జరుగుతుందని, పీచు నిల్వకు గోదాములు నిర్మించాలని పరిశ్రమల నిర్వాహకులు కోరుతున్నారు.

జిల్లాలో వివరాలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా 34 పరిశ్రమలు
ప్రధానంగా ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, యలమంచిలిలో పరిశ్రమలు
సుమారుగా 3000 మందికి ఉపాధి
జిల్లాలో 20 వేల ఎకరాలకు పైగా కొబ్బరి తోటల సాగు



కొబ్బరి డొప్పల నుంచి తయారైన పీచు

రాయితీ కల్పించాలి..



కొబ్బరి పీచు పరిశ్రమల పరిస్థితి బాలేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయాం. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న కొబ్బరి పీచు పరిశ్రమలకు విద్యుత్ రాయితీ కల్పించాలి. జిల్లాలో మరిన్ని కొబ్బరి పీచు తయారీ పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. స్థానిక మహిళలకు ఉపాధి కలుగుతోంది.

– కోలా జగదీష్, యాజమాని, కొరుప్రోలు గ్రామం

రెండేళ్లుగా లాభాల్లేవు..



రాంబిల్లి మండలంలో రాధాస్వామి ఫైబర్ కొబ్బరి పీచుతయారీ పరిశ్రమను 2022లో ప్రారంభించాను. 10 నుంచి 15 మందికి ఉపాధి కల్పిస్తున్నాను. గత రెండేళ్లగా ఆశించిన స్థాయిలో లాభాలు లేవు. ప్రభుత్వం నుంచి సాంకేతిక సహకారం కావాలి. కొత్త కొత్త ఉత్పత్తులు తయారు చేసేలా ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. విద్యుత్ సబ్సిడీ కల్పిస్తే మరింత విస్తరిస్తాం . మరింత మందికి ఉపాధి కల్పిస్తాం.

– రాధా సుందర సుబ్బరాజు (కిశోర్‌రాజు), పరిశ్రమ యజమాని, రాంబిల్లి

రీ సర్వే పక్కాగా జరగాలి

- కమిషనర్, ల్యాండ్ సర్వే సామర్లకోట డీఐవోఎస్ శ్రీధర్



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ ల్యాండ్ సర్వే సామర్లకోట డీఐవోఎస్ శ్రీధర్

నాతవరం: ప్రభుత్వ నిబంధనలు అనుసరించి భూరీసర్వే తప్పులు లేకుండా చేయాలని కమిషనర్ సర్వే అఫ్ ల్యాండ్ సామర్లకోట డీఐవోఎస్ బాడుగ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మండలంలో భూరీసర్వే చేస్తున్న పెద భైరవ భూపతి అగ్రహారం రెవెన్యూ గ్రామంలో సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివరాలు మండల సర్వేయర్ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ రెవెన్యూ గ్రామంలో మొత్తం 106 ఎకరాలు 95 సెంట్లు విస్తీర్ణం ఉందని, 95 మంది రైతులు ఉన్నారని సర్వేయరు తెలిపారు. 23 సర్వే నంబర్లు ఉన్నాయని, 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఈ రెవెన్యూ గ్రామంలో ఉన్నట్టు భూ సర్వేలో వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భూరీసర్వే జరుగుతుందన్నారు. మొదటగా కొన్ని రెవెన్యూ గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడ ముందుగా రీసర్వే చేసి తప్పులు లేకుండా చేస్తున్నామన్నారు. వాటి అధారంగా మిగతా రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలని, ఈ రెవెన్యూ గ్రామంలో భూ రీసర్వే 180 రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రీసర్వే టాస్క్‌ఫోర్సు సర్వే ఇన్‌స్పెక్టర్ ఎ.వేణుగోపాల్, నర్సీపట్నం డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ ఎంఆర్‌పి బాబు, మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ, మన్యపురట్ల వీఆర్వో మాకిరెడ్డి చలపతి, సచివాలయ సర్వేయర్లు విజయ కుమార్, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

- గుర్తు తెలియని వ్యక్తుల దురాగతం
- దళిత నాయకుల నిరసన



విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

పాయకరావుపేట : పట్టణంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కులో అంబేడ్కర్ విగ్రహం తలను గుర్తు తెలియని పగులగొట్టినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. పార్కులోనే సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం ఉండడం వల్ల సోమవారం ఆ శాఖ అధికారులు విగ్రహం ధ్వంసం చేసి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సిఐ జి.అప్పన్న పార్కుకు వచ్చి ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. దళిత నాయకులు, అంబేడ్కర్ ఇండియా మిషన్ జోనల్ ఇన్‌చార్జ్ కొల్లాభక్తుల దిలీప్, అధ్యక్షుడు జల్లు చినబాబు, స్థానిక దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్‌లు దోషులను శిక్షించాలని అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విగ్రహం పగులకొట్టిన వ్యక్తులను గుర్తించి, చట్ట ప్రకారం శిక్షించడం జరుగుతుందన్నారు. విశాఖపట్నం నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్కాడ్‌ను కూడా రప్పించడం జరుగుతుందన్నారు. కాగా స్థానిక దళిత నాయకులు పల్లా విలియం కేరి, బోడపాటి శ్రీను, నెలపర్తి అర్జున్, ఇంజరపు సూరి బాబు, గారా చంటి, కువ్వల కుమార్, ముక్కుడుపల్లి దాసు, తదితరులు విగ్రహం వద్ద ఆందోళన జరిపారు.

రంగురాళ్ల అన్వేషణ ఎవరి కోసం?

- సీరియస్‌గా తీసుకున్న అటవీ అధికారులు
- తేలిగ్గా తీసుకున్న మైనింగ్ అధికారులు
- రెండు శాఖల మధ్య రచ్చ



క్వారీలో లభించే రంగురాళ్లు

నర్సీపట్నం : రంగుల రాళ్ల అన్వేషణ రెండు శాఖల మధ్య వివాదాన్ని రాజేసింది. కరక రంగురాళ్ల క్వారీకి సర్వే పేరుతో గనులశాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి ఆరుగురుతో వెళ్లడాన్ని అటవీశాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. అయితే గనులశాఖ ఆర్ఐకు షోకాజ్ నోటీసు ఇవ్వడాన్ని ఆ శాఖ ఏడీ తేలిగ్గా తీసుకున్నారు. కానీ తమకు అటవీ అధికారులు షోకాజ్ నోటీసు ఇవ్వడంపై ఆ శాఖ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇక్కడి ఖనిజ సంపదను అటవీ అధికారులు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ఏపీ ఫారెస్టు యాక్టు సెక్షన్-20(1)సి ప్రకారం ముందస్తు అనుమతులు లేకుండా నిషేధిత ప్రాంతమైన కరక కొండపైకి ఎవరూ వెళ్లకూడదని అటవీ చట్టం పేర్కొంటుంది. కనీసం అటవీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఎవరి మేలు కోసం మైనింగ్ అధికారులు కరక కొండపైకి వెళ్లారనేది చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంలో క్రియాశీలకంగా వ్యవహరించే నాయకులు, రంగురాళ్ల వ్యాపారంలో అనుభవం కలిగిన వ్యక్తులను వెంటబెట్టుకొని గనులశాఖ అధికారి కరక క్వారీకి వెళ్లడంతో పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు. అటవీ సిబ్బందితో పాటు పోలీసులు క్వారీ ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఏ ఉద్దేశంతో క్వారీలోకి ప్రవేశించారో తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు. నోటీసు విషయంపై గనులశాఖ ఏడీ శివాజీని వివరణ కోరగా నోటీసు ఇచ్చిన వారినే వెళ్లి అడగండి అంటూ సమాధానం ఇచ్చారు. నాలుగు రోజులు ఆగితే షోకాజ్ నోటీసు ఇచ్చిన వారే సమాధానం చెబుతారంటూ అసహనం వ్యక్తం చేశారు.

లక్ష్యాన్ని మించి విద్యుదుత్పత్తి

- టార్గెట్ సాధిస్తాం: ఈఈ రాజేంద్రప్రసాద్

సీలేరు: సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి టార్గెట్‌ను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేస్తామని ఏపీ జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జల విద్యుత్ కేంద్రంలో నిర్దేశించిన సమయానికి టార్గెట్‌ను పూర్తి చేసేందుకు సిబ్బంది, ఇంజినీర్లు సమష్టిగా కృషి చేస్తున్నారన్నారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో ప్రస్తుతం 4 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, గ్రిడ్ ఆదేశాల మేరకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో 418.62 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశామని, ఈ ఏడాది టార్గెట్‌ను మార్చి 31 లోపు పూర్తి చేస్తామని ఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ప్రయోగంపై నిఘా నేత్రం

- రేపటి నుంచి ఒకేషనల్, 10 నుంచి జనరల్ సైన్స్‌లో ప్రాక్టికల్స్
- సీసీ కెమెరాల ద్వారా ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- జిల్లాలో 88 పరీక్ష కేంద్రాలు.. 13,225 మంది విద్యార్థులు
- జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి సుజాత





బి.సుజాత, డీఐఈవో

సాక్షి ఇంటర్వ్యూ

యలమంచిలి రూరల్: ఈసారి ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలను ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం జిల్లాలోని ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఫిబ్రవరి 5 నుంచి ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే జిల్లాలో 88 కేంద్రాల్లో భౌతిక, రసాయన, వృక్ష, జంతు శాస్త్ర ప్రయోగాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సమన్వయంతో పనిచేస్తూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి (డీఐఈవో) బి.సుజాత 'సాక్షి'కి తెలిపారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

పూర్తి సౌకర్యాలు ఉన్న కాలేజీల్లోనే ప్రాక్టికల్స్

జిల్లాలో మొత్తం 147 జూనియర్ కళాశాలలుండగా వాటిలో ప్రయోగశాలలు, పూర్తి సౌకర్యాలున్న 88 కళాశాలల్లోనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. వొకేషనల్ కోర్సులకు ఈనెల 5వ తేదీ నుంచి, సైన్స్ కోర్సులు చదివే విద్యార్థులకు ఈనెల 10వ తేదీ నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొత్తం 13,225 మంది విద్యార్థులు పాల్గొంటున్న ఈ పరీక్షలు ఈ నెల 20వ తేదీతో ముగుస్తాయి. ఆదివారం సహా ఆయా తేదీలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయి. మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న థియరీ పరీక్షలకు 34 పరీక్ష కేంద్రాలు కేటాయించాం.

సొంత కళాశాలల్లోనే..

ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో జంబ్లింగ్ విధానం అమల్లో లేదు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే పరీక్షలు రాస్తారు. తక్కువ విద్యార్థులున్న కళాశాలలను సమీపంలోని కళాశాలలతో కలిపి నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. ప్రయోగ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్ణీత సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ప్రతి కేంద్రంలో నాలుగు ల్యాబ్‌లు అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ అధ్యక్షతన డీఐఈవో కన్వీనర్‌గా డెక్ కమిటీ, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించనున్నాయి. హాల్ టికెట్లను త్వరలోనే ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు వాటిని విద్యార్థులకు అందజేస్తారు.

గంట ముందుగా ప్రశ్నపత్రం

ప్రయోగ పరీక్షలకు సంబంధించి ఉదయం, మధ్యాహ్నం సెషన్లకు వేర్వేరుగా ప్రశ్న పత్రాలు గంట ముందుగా కళాశాలల లాగిన్లకు పంపిస్తారు. వీటిని ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసి ఎగ్జామినర్లకు అందిస్తారు. వారు విద్యార్థులకు నిబంధనల మేరకు నిర్వహిస్తారు. 30 మార్కులకు ప్రయోగ పరీక్ష ఉండగా కనీసం 11 మార్కులు వస్తే విద్యార్థి ఉత్తీర్ణత సాధించినట్టుగా భావిస్తారు.

పారదర్శకత కోసమే సీసీ కెమెరాలు

పారదర్శకంగా ప్రయోగ పరీక్షలు నిర్వహించడానికే కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే ప్రయోగ పరీక్షలకు సంబంధించి సైన్సు సబ్జెక్టులు బోధిస్తున్న అధ్యాపకులకు శిక్షణ కూడా పూర్తి చేశాం. ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం .థియరీ పరీక్షలు వచ్చే నెల 1వ తేదీ నుంచి 19 వరకు జంబ్లింగ్ విధానంలో జరుగుతాయి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక దృష్టి సారించాలి.

క్లుప్తంగా

వైభవంగా సూర్యదేవుని కల్యాణం


స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్ : రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు సోమవారం ఘనంగా చేపట్టారు. సుమారుగా 50 మంది దంపతులు స్వామివారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం రాజుపాలెం, వల్లూరు, ఎరుకువానిపాలెం గ్రామాలలో మహిళలు తయారుచేసిన వివిధ రకాల పిండి వంటకాలను వైభవంగా ఊరేగించి, స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ దేవస్థానం వైస్ చైర్మన్ కర్రి కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు గొల్లవిల్లి రామకోటేశ్వరరావు, గొల్లవిల్లి కృష్ణ ప్రసాద్, గొల్లవిల్లి నర్సింగరావు, సిదిరెడ్డి సూకరాజు, బండారు వెంకటరమణ, అందే బాబురావు చేబోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి పూజలు


పూజలు చేస్తున్న శ్రీప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట: శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సరస్వతీదేవికి విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయులు వసంత పంచమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు తలుపులమ్మ తల్లి దేవస్థానంలో జరిగిన సరస్వతీ యాగంలో పాల్గొన్నారు. దేవస్థానం ఈవో విశ్వనాథరాజు పర్యవేక్షణలో పదో తరగతి విద్యార్థులు అమ్మవారి పూజలో ఉంచిన పెన్నులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

నక్కపల్లి : జాతీయ రహదారిపై సారిపల్లె పాలెం జంక్షన్ వద్ద సోమవారం సారిపల్లిపాలెంకి చెందిన యలమంచిలి నూకాలమ్మ(53) రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి రాజమండ్రి వెళ్తున్న బస్సు ఢీ కొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

బ్రహ్మాద్రి శిఖరాన ప్రత్యక్ష నారాయణుడు

- రాజుపాలెంలో నేడు రథసప్తమి వేడుకలు
- రెండో అరసవిల్లిగా ప్రతీతి
- లక్ష మంది భక్తులు దర్శనానికి వస్తారని అంచనా
- గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు
- పలు సాంస్కృతిక ప్రదర్శనల ఏర్పాటు


రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవాలయం

అనకాపల్లి : ఉత్తరాంధ్రలో రెండో అరసవల్లిగా అభివృద్ధి చెందుతున్న జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ప్రతినిధులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తెలిపారు. రథసప్తమి పురస్కరించుకుని సుమారుగా లక్షమంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో కమిటీ సభ్యులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు.

ఆలయ చారిత్రక నేపథ్యం...

బ్రహ్మాద్రిపై వెలిసిన సూర్యనారాయణస్వామికి చారిత్రక నేపథ్యముంది. రాజుపాలెం గ్రామానికి అనుకుని ఉన్న బ్రహ్మాద్రిపై నాలుగు దశాబ్దాల క్రితం స్వామివారి శిలావిగ్రహం దొరికింది. పరిసర గ్రామాలకు చెందిన గొర్రెల కాపరి కొండపైకి వెళ్లినప్పుడు స్వామివారి విగ్రహం లభించడంతో అనాటి నుంచి రథోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. రథోత్సవం రోజున గతంలో స్వామివారిని ఊరేగించి సమీపంలో ఉన్న ఉప్పునీటి నూతిలో వేసేవారు. కొన్నేళ్లకు బావి పూడికపోయింది. స్వర్గీయ అనకాపల్లి మాజీ ఎంపీగా పనిచేసి కొణతాల బాబురావు చొరవ తీసుకుని రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవస్థానాన్ని స్థానికుల సహకారంతో నిర్మించి అదనపు హంగులు కల్పించారు. ఆలయ పరిసరాల్లో యాగశాల, ఆంజనేయస్వామి విగ్రహం, వైకుంఠనారాయణస్వామి విగ్రహం, ద్వాదశ ఆతిథ్యులు, సప్తరుషి యాగశాల, నాగబంధ ఈశ్వరుడు, లలితాదేవి, సుదర్శమూర్తి ఆలయాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కొత్తగా లలితాదేవి ఆలయానికి మెట్లమార్గం, జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వీవీఐపీ భక్తులకు ప్రత్యేక రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు విశ్రాంతి మందిరం, ఆనంద నిలయాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు ఇలా...

స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచే భక్తులు పాటెత్తే అవకాశమున్నందున


ఆంజనేయ స్వామి దేవాలయం


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి

బారికేడ్లు ఏర్పాటు చేశారు. చలువపందిళ్లను ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు అందజేయనున్నారు.

భారీ అన్నసమారాధన

రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని వ్యాపారవేత్త బండారు ఆదిబాబు, సూరిబాబు, రమణ దంపతులు ఆధ్వర్యంలో సుమారుగా 18వేల మందికి మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఆలయానికి చేరుకోవడం ఎలా...

గాజువాక- అనకాపల్లి జాతీయ రహదారిలో కె.ఎస్.ఆర్.పేట బస్‌స్టాప్ నుంచి రాజుపాలెం గ్రామానికి సుమారుగా 5 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మార్గంలో రైల్వే గేటు ఉండడంతో ఎక్కువసార్లు గేట్లు వేయడం వల్ల భక్తులకు ఇబ్బందిగా ఉంటుంది. విశాఖ నుంచి వచ్చే భక్తులు తాడి గ్రామం మీదుగా రాజుపాలెం, మునగపాక మండలం నుంచి వచ్చే భక్తులు ఎరుకవానిపాలెం గ్రామం మీదుగా రాజుపాలెం స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని రూరల్ సీఐ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

రాత్రికి ప్రత్యేక కార్యక్రమాలు....

వేడుకల సందర్భంగా డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం, బుర్రకథ, 20 మంది కళాకారులతో తప్పెట గుళ్లు, తొడపెద్దు సేవ, బాణాసంచా హంగామా, 200 మంది కళాకారులతో భక్తి రస కోలాటాలు, నమో వెంకటేశాయ నృత్య ప్రదర్శన వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.

బంగారం కోసమే హత్య

- నిందితుడు అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ
- నిందితుడిపై మరో కేసు కూడా ఉంది
- వివరాలు వెల్లడించిన ఎస్పీ తుహిన్ సిన్హా

చోడవరం : తీవ్ర సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును ఎట్టకేలకు పోలీసులు ఛేధించారు. ముందుగా అంతా ఊహించినట్టుగానే బంగారం కోసమే మహిళను హత్య చేసినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలిసింది. నెల రోజులుగా ఎంతో ఉత్కంఠతో ఉన్న ఈ కేసు మిస్టరీ వీడడంతో పోలీసులు సైతం ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం వెల్లడించారు. నిందితుడు బంగారం కోసమే మహిళను హత్య చేసినట్టు ఆయన చెప్పారు. చోడవరం మండలం లక్కవరం పంచాయతీ శివారు మారుతీనగర్ సమీపంలో గవరవరం వెళ్లే రోడ్డు పక్కన ఈ ఏడాది జనవరి 9వ తేదీన పొలంలో లక్కవరం గ్రామానికి చెందిన ఒబలరెడ్డి నరసమ్మ అనే మహిళ హత్యకు గురైంది. మేకల కోసం గడ్డి కోసేందుకు కత్తి పట్టుకొని ఆమె వెళ్లింది. గడ్డికోసం వెళ్లిన తన భార్య చీకటి పడినా రాకపోవడంతో ఆమె భర్త నర్సింహమూర్తి వెతుకుతుండగా బండారు లక్ష్మయ్యకు చెందిన పొలంలో రక్తపుమడుగులో పడి ఉండడాన్ని గమనించి చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన డీఎస్పీ శ్రావణి పర్యవేక్షణలో చోడవరం ఎస్ఐ అప్పలరాజు, ఎస్ఐలు నాగకార్తీక్‌తో కూడిన పోలీసు, ప్రత్యేక ఐటీ కోర్, క్రైమ్ పోలీసు బృందాలను రంగంలోకి దింపామని ఎస్పీ చెప్పారు. వీరంతా సకాలంలో పూర్తి వివరాలు సేకరించి నిందితుడ్ని చోడవరం మండలం గజపతినగరం వద్ద సోమవారం ఉదయం పట్టుకున్నారని ఎస్పీ చెప్పారు. నిందితుడు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం జమ్మాదేవి పేటకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మహిళను హత్య చేసి ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారాన్ని అపహరించాడని చెప్పారు. అపహరించిన బంగారాన్ని విజయనగరం ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.1.85లకు తాకట్టు పెట్టినట్టు గుర్తించామన్నారు. ఆ డబ్బులను నేరుగా నిందితుడే ఏటీఎంల ద్వారా లావాదేవీలు నిర్వహించినట్టు గుర్తించామన్నారు. ఆ సమయంలో సీసీ కెమెరాలు ఆధారంగా నిందితుడి కదలికలను గుర్తించి ఏపీతో పాటు మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో కూడా వెతికామన్నారు. ఇతని దగ్గర నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ఆ సమయంలో వేసుకున్న దుస్తులను స్వాధీనపర్చుకున్నామని ఎస్పీ చెప్పారు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్పీ చెప్పారు. కాగా కోర్టు రిమాండ్ విధించింది.

నిందితుడిపై గతంలో మరో కేసు

లక్కవరం మహిళ హత్యకేసులో నిందితుడిపై గతంలో మరో కేసు ఉందని ఎస్పీ చెప్పారు. విజయనగరం జిల్లా కొత్తవలస పోలీసు స్టేషన్‌లో కూడా ఇతనిపై కేసు నమోదై ఉందని, ఓ మహిళను హత్య చేసి బంగారం అపహరించినట్టు కేసు నమోదై ఉందన్నారు. జిల్లా జైలు అధికారుల నుంచి సేకరించిన సమాచారంలో నిందితుడి కదలికలపై నిఘా పెంచడంతో పట్టుపడ్డాడని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ఎంతో నిబద్ధతతో పనిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఆ గ్రామాలకు కరెంటొచ్చింది...

- రెండు మారుమూల గిరిజన గ్రామాలకు తొలిసారిగా విద్యుత్ సదుపాయం

రోలుగుంట : మారుమూల గిరిజన గ్రామంలో తొలిసారి విద్యుత్ వెలుగులు ప్రసరించాయి. మండలంలో ఆర్ల పంచాయితీ శివారు నీలబంద గ్రామానికి విద్యుత్ అధికారులు తొలిసారిగా విద్యుత్ వెలుగులు అందించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి సర్కిల్ విద్యుత్ ఎస్ఈ గొప్పు ప్రసాద్ సోమవారం తెలిపిన వివరాలివి. ప్రతి మారుమూల గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలన్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రతిపాదనల మేరకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఈ. పృధ్వీతేజ్ ఆదేశాల మేరకు పీవీటీజీ గిరిజన ఆవాసాల్లో నివసిస్తున్న గిరిజనులకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా, నర్సీపట్నం గ్రామీణ ప్రాంత పరిధిలో రోలుగుంట మండలం పిట్టగెడ్డ గ్రామం నుంచి సుమారు 10 సంవత్సరాలు క్రితం వలస వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకున్న నీలబంద గ్రామానికి నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం ఎంతో క్లిష్టతరమైనప్పటికీ రోడ్డు సౌకర్యం లేని ఆ గ్రామానికి సిబ్బంది ఆరు కిలోమీటర్లు దూరం విద్యుత్ స్తంభాలు మోసుకెళ్లి విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. గ్రామంలో 4 కుటుంబాలకు చెందిన 20 మంది నివసిస్తున్నారని, వారి ఇళ్లకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందించామని తెలిపారు. అలాగే రావికమతం మండలంలో చీమలపాడు పంచాయతీలో సోంపురంబండ శివారు గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించామని ఎస్ఈ ప్రసాదు తెలిపారు.

చట్ట సవరణ ఆలోచన విరమించుకోండి

- 1/70పై స్పీకర్ వ్యాఖ్యలకు గిరిజన సంఘాల ఖండన


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన ఉద్యోగుల సంఘ నాయకులు ధనార్జన్, ధర్మరాజు, గిరిశాస్త్రి

నర్సీపట్నం : పెట్టుబడిదారులకు అనుకూలంగా 1/70 చట్టాన్ని సవరించాలన్న రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ధనార్జన్, జనరల్ సెక్రటరీ సమిడ ధర్మరాజు, ఉపాధ్యక్షుడు పి.వి.గిరిశాస్త్రి పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జనవరిలో విశాఖలో పెట్టుబడిదారుల సదస్సు జరిగిందన్నారు. గిరిజన ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి జరగాలంటే పెట్టుబడిదారులు స్టార్ హోటళ్లు నిర్మించుకునేందుకు అవసరమైతే 1/70 చట్టాన్ని సవరించాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు సరికాదన్నారు. చట్టం గురించి అవగాహన లేదంటూనే స్పీకర్ అలా మాట్లాడడం భావ్యం కాదన్నారు. చట్ట సవరణ జరిగితే ఆదివాసులు అటవీ హక్కు, భూమి మీద హక్కు, స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అమాయక గిరిజనుల భూములను ప్రైవేటు పెట్టుబడిదారులు కారు చౌకగా కొనేసి జీవనోపాధి లేకుండా చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. అరకు, లంబసింగి ప్రాంతాలను అభివృద్ధి చేద్దామన్న ఆలోచన ఉంటే ఏపీ టూరిజం ద్వారా స్టార్ హోటల్స్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అరకు, లంబసింగి ప్రాంతాల్లో కాఫీ డెవలప్‌మెంట్ ఇండస్ట్రీ(ప్రాసెసింగ్ యూనిట్)ని ప్రభుత్వమే నిర్మించి గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు.

త్వరగా వీఎంఆర్‌డీఏ అభివృద్ధి పనుల పూర్తి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం


అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్

సాక్షి, అనకాపల్లి: వీఎంఆర్‌డీఏ చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి ఆమె జిల్లాలో అంతకాపల్లి, సిరసపల్లి, బాటజంగాలపాలెం ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. కోడూరు నుంచి అనకపల్లికి రహదారి, రావుగోపాలరావు ఆడిటోరియం ఆధునీకరణ, సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టబోతున్న కొత్తూరు ఉద్యానవనం పనులను, తుమ్మపాలలో నిర్మించనున్న కన్వెన్షన్ సెంటర్, షాపింగ్ కాంప్లెక్స్, తదితర అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. అంతకన్నా ముందు పెందుర్తి నియోజకవర్గంలో వేపగుంట నుంచి పినగాడి వరకు 150 అడుగుల మేర రహదారిని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ పరిశీలించారు. సర్వేశాఖ సహాయ సంచాలకుడు గోపాలరాజు, వీఎంఆర్‌డీఏ ముఖ్య ప్రణాళికా అధికారి శిల్పా, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, ఎల్‌వోపీ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీర్ రాంబాబు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రసాద్, సహాయక ఇంజినీర్ నాయుడు, ప్రణాళికా విభాగపు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లి అగ్రహారానికి జాతీయ స్థాయి గుర్తింపుపై హర్షం


వీరవల్లి అగ్రహారం సర్పంచ్ కామలక్ష్మి దంపతులు, కార్యదర్శి జగదీష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

మాడుగుల రూరల్: మండలంలోని వీరవల్లి అగ్రహారం ఇటీవల జరిగిన గణతంత్ర వేడుకల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికై అవార్డు అందుకోవడంపై పార్టీలకు అతీతంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామ సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు దంపతులతో పాటు అప్పటి పంచాయతీ కార్యదర్శి కోరుకొం జగదీష్, సచివాలయ సిబ్బందిని గ్రామస్తులు సన్మానించారు. గ్రామంలో అభివృద్ధి పనులు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో జాతీయ స్థాయి అవార్డు లభించిందని పలువురు వక్తలు ప్రశంసించారు. ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం హర్షనీయమని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ గుణమ్మా, గతంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు రెడ్డి కవిత, కోరుకోండ జగదీశ్, ప్రస్తుత కార్యదర్శి సత్యనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త వెలగాడ ఈశ్వరరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు పాచిల ఆదెయ్య, సయ్యపురెడ్డి హరికృష్ణ, మాజీ సర్పంచ్ నారాయణరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాచిల రమణ, తదితరులు పాల్గొన్నారు.

బండరాళ్ల లారీల తనిఖీ


ఆర్.నర్సాపురం వద్ద బండరాళ్ల లారీలను ఆపి బిల్లులు తనిఖీ చేస్తున్న అధికారులు

రాంబిల్లి(యలమంచిలి): పరిమితికి మించి అధిక బరువుతో బండరాళ్లను తరలిస్తున్న లారీలపై కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ మైనింగ్ జియోలజిస్ట్ పురుషోత్తమనాయుడు తెలిపారు. రాంబిల్లి మండలంలో నేవల్ బేస్ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా బండరాళ్లను తరలిస్తున్న లారీలను సోమవారం సాయంత్రం ఆర్.నర్సాపురం గ్రామం వద్ద తనిఖీలు చేశారు. విషయం తెలుసుకున్న పలువురు డ్రైవర్లు లారీలను రోడ్డు పక్కన నిలిపేసి, అక్కడి నుంచి పరారయ్యారు. 15 లారీల బిల్లులను అధికారులు తనిఖీ చేశారు. బిల్లులు లేని ఓ లారీకి రూ.17 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నేవల్ బేస్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం బండరాళ్లను తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడి, అనకాపల్లి వద్ద మార్టూరు, తుమ్మపాల సమీప ప్రాంతాల కొండల నుంచి తీసుకురావడానికి లారీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఎరిమితికి మించి లోడింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు వెళ్లిన కొంత సమయానికి పరారైన డ్రైవర్లు వచ్చి లారీలను తీసుకువెళ్లిపోయారు.

మద్యానికి బానిసై వృద్ధుడి ఆత్మహత్య


మృతుడు అప్పలనాయుడు

కోటవురట్ల : మందు తాగితే ఆరోగ్యం చెడిపోతుందని మందలించినందుకు ఓ వృద్ధుడు మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలివి..మండలంలోని టి.జగ్గంపేట గ్రామానికి చెందిన కొరుప్రోలు అప్పలనాయుడు(67) మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం పింఛను డబ్బులు అందడంతో అదేపనిగా తాగుతుండడంతో అతని కొడుకులు మందలించారు. మనస్తాపం చెందిన అప్పలనాయుడు సోమవారం ఉదయం ఇంటి నుంచి పొలానికి వెళ్లి పత్తి చేనుకు స్ప్రే చేసే పురుగు మందు తాగాడు. కొద్ది సేపటికి అక్కడే ఉన్న కొడుకు రమణతో పురుగుమందు తాగాను.. కడుపునొప్పిగా ఉందని చెప్పడంతో మొదట నమ్మలేదు. అయితే నిజంగానే తాగానని చెప్పడంతో వెంటనే కోటవురట్లలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికి మృతి చెందాడు. రమణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఎం.కోటపాడులో భారీ చోరీ

- రూ. 2.5 లక్షల నగదు, ఐదున్నర తులాల బంగారు ఆభరణాల అపహరణ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నారాయణరావు

మాడుగుల: మండలంలో ఎం.కోటపాడు గ్రామంలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనక నుంచి చొరబడి రూ.2.50 లక్షల నగదు, ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, 100 తులాల వెండి వస్తువులు పట్టుకుపోయారు. బాధితుడు సుంకర ముత్యాల నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎం.కోటపాడుకు చెందిన ముత్యాలనాయుడు కొత్త ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.2.50 లక్షల నగదు అప్పు తెచ్చి ఇంట్లో పెట్టారు. ఈ నెల 6న గృహ ప్రవేశం చేయనుండడంతో వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం సాయంత్రం చోడవరం వెళ్లారు. మరునాడు ఉదయం ఇంటికి వచ్చి తలుపులు తీయగా బీరువాలో వస్తువులన్నీ చిందర వందరగా ఉన్నాయి. బీరువాలో నగదు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు కనిపించ లేదు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నారాయణరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డుపై కత్తితో యువతి హల్‌చల్


కత్తితో మార్నింగ్ వాక్ చేస్తున్న యువతి

నర్సీపట్నం : మున్సిపాలిటీ శారదానగర్‌కు చెందిన మతిస్థిమితం లేని యువతి సోమవారం మెయిన్ రోడ్డుపై కత్తి పట్టుకుని రోడ్డుపై అటూ ఇటూ తిరుగుతుండడంతో పలువురు ఆందోళన చెందారు. యువతి ఆరోగ్య పరిస్థితి తెలియక కొందరు ఆమెను ప్రశ్నించడంతో తాను సీబీఐ అధికారిణి అంటూ మీకు అనవసరం అంటూ బదులిచ్చింది. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ గోవిందరావు సత్వరమే స్పందించి, యువతిని అదుపులోకి తీసుకున్నారు. గణపతిరాజు భూదేవి అనే ఆ మహిళకు మానసిక స్థితి సరిగా లేదని, ఆమెను కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించామని సీఐ తెలిపారు.

వైద్య విద్యార్థి విషాదాంతం

- నెల్లూరు బీచ్‌లో గల్లంతైన షణ్ముఖనాయుడు
- మృతదేహం లభ్యం
- మునగపాకలో విషాదఛాయలు


మృతుడు షణ్ముఖ నాయుడు (ఫైల్)

మునగపాక(అచ్యుతాపురం): అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు తీరని లోకాలని వెళ్లిపోయాడని తెలుసుకున్న ఆ తల్లిదండ్రులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. సముద్రంలో గల్లంతైన వైద్య విద్యార్థి కోసం కన్నవాళ్లు పెట్టుకున్న ఆశలు సోమవారం ఉదయంతో గల్లంతయ్యాయి. వివరాలివి...మునగపాక గ్రామానికి చెందిన పెంటకోట కాశీ, మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బెంగళూరులో చదువుకుంటుండగా, రెండో కుమారుడు ఇటీవలే నెల్లూరులోని ఒక మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరాడు. ఆదివారం సెలవు కావడంతో సదరు వైద్యవిద్యార్థి షణ్ముఖనాయుడు (18) నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరు ఏపీ జెన్కో పంప్ హౌస్ బ్యాక్ వాటర్ వద్దకు స్నేహితులతో కలిసి వెళ్లారు. అక్కడ పెద్ద బండరాయి వద్ద వారు నిలబడి ఉండగా ఒక్కసారిగా నీటి మట్టం పెరగడంతో స్నేహితులు ఒక్కొక్కరుగా జారి పోయారు. ఈ ఘటనలో షణ్ముఖనాయుడు సముద్రంలో గల్లంతయ్యాడు. మత్స్యకారులు వలలు వేసి ఇద్దరిని రక్షించినప్పటికీ షణ్ముఖనాయుడి జాడ తెలియలేదు. సోమవారం పోలీసులు వెతగ్గా షణ్ముఖనాయుడు మృతదేహం వెలుగుచూసింది. దీంతో ఇక్కడ మునగపాకలో తీవ్ర విషాధ ఛాయలు అలుముకున్నాయి.

కారు ఢీకొని వ్యక్తి మృతి


బాజ్జీ మృతదేహం

అనకాపల్లి : మండలంలో పిసినికాడ జాతీయ రహదారిలో కశింకోట నుంచి విశాఖ వెళ్లే మార్గంలో కారు ఢీ కొనడంతో ఎస్.కె.బాజ్జీ అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ రవికుమార్ సోమవారం చెప్పారు. సుమారుగా 5 అడుగుల ఎత్తు, ఎరుపురంగు ఛాయ, కుడిచేతిపై ప్రభాస్ అభిమాని, కుడి భుజంపైన 786, చందమామ, బొమ్మ పచ్చబొట్టు, బాహుబలి, మున్నా, సినిమా పేర్లు ఉన్నట్టు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు. స్థానికులు మృతుడు స్వస్థలం విజయనగరం జిల్లాకు చెందినట్టు చెబుతున్నారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతుని వివరాలు తెలిసినట్టయితే 9440796085 నంబరును సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ప్రతి మూడో శనివారం పారిశుధ్య డ్రైవ్

డీపీవో శిరీషారాణి



వర్మీకంపోస్టు యార్డును పరిశీలించిన డీపీవో శిరీషారాణి

అనకాపల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేసిన వర్మీకంపోస్టు యార్డులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి శిరీషారాణి తెలిపారు. కూండ్రం గ్రామంలో వర్మీకంపోస్టు యార్డును సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటి నుంచి పారిశుధ్య కార్మికులు సేకరించిన తడిపొడి చెత్తను ఎరువుల తయారీకి ఉపయోగించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి మూడో శనివారం ప్రత్యేక పారిశుధ్యంపై సమావేశాలు నిర్వహించాలన్నారు. గ్రామంలో చెత్తను ఎలా ఎరువు కింద వాడుతారో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.వి.వి.ప్రసాద్, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకుల అరెస్టు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జి, ఫణీంద్ర

అనకాపల్లి టౌన్: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడాన్ని నిరసిస్తూ అన్నమయ్య జిల్లాలో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బాబ్జి, ఫణీంద్ర తెలిపారు. సోమవారం స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల రోగులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబు మాత్రం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం అన్యాయమన్నారు. విద్యార్థి సంఘాల నాయకులపై తప్పుడు కేసులు పెడితే రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవడం తప్పదన్నారు. వారిని తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై విమర్శలు సిగ్గుచేటు

అనకాపల్లి: దేశంలో విలువలకు, నిజాయితీకి మారుపేరుగా మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని ఎదురిస్తున్న ఆప్ అధినేత కేజ్రీవాల్‌ను ఢిల్లీ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విమర్శించడం సిగ్గుచేటని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ స్థానంలో పోరాడి నిర్దోషిగా బయటకు వచ్చిన కేజ్రీవాల్‌ను విమర్శించే స్థాయి ముఖ్యమంత్రికి లేదన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.

క్రషర్ల వద్ద లారీ యజమానుల నిరసన



క్రషర్ల వద్ద లారీ యాజమానులు

తుమ్మపాల: మండలంలో మార్టూరు, రేబాక గ్రామాల్లో ఉన్న పలు క్రషర్ల వద్ద సోమవారం లారీ యాజమానులు నిరసన వ్యక్తం చేశారు. లారీలు అడ్డుపెట్టి పిక్క రావాణా నిలిపివేశారు. గ్రామంలో అన్ని క్వారీ లారీల రాకపోకలను అనుమతిస్తూ, మార్టూరు, మాకవరం గ్రామాల క్వారీ లారీలను మాత్రమే అడ్డుకోవడంతో వివాదం కొనసాగుతోంది. క్రషర్ల నుంచి చింతనిప్పుల అగ్రహారం, రేబాక గ్రామాల మీదుగా వెళ్లాల్సిన లారీలు మార్టూరు, తుమ్మపాల మీదుగా రేబాక వచ్చి జాతీయ రహదారిపైకి చేరుకోవడంతో అదనంగా 15 కిలోమీటర్ల మేర దూరం పెరిగింది. అదే చింతనిప్పుల అగ్రహారం లారీలు క్రషర్ల నుంచి నేరుగా రేబాక మీదుగా హైవేకి చేరుకోవడంతో 10 కిలోమీటర్ల దూ రం తగ్గడంతో వ్యాపారులు అగ్రహారం లారీలకే లోడింగ్ ఇస్తున్నారు. దీంతో మార్టూరు, మాకవరం గ్రామాల్లో క్వారీలు, క్రషర్లలో పిక్క, కంకర అగ్రహారం లారీలకు ఇవ్వడం కుదరదని రెండు గ్రామాల లారీల యజమానులు ఒత్తిడి తేవడంతో కొద్ది రోజులుగా లోడింగ్ నిలిచిపోయింది. క్రషర్ల యాజమానుల ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చినా ఫలితం లేక పోయింది. ఇరు గ్రామాల లారీల యాజమానులు అధికార పార్టీకి చెందిన వారే కావడంతో ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు.

ఐఎస్ఐ అనుమతి లేకుండానే నిర్వహణ

స్వచ్ఛత పాటించని యజమానులు

అనారోగ్యం బారిన ప్రజలు

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు



గవరపాలెంలో ఒక ప్రైవేటు వాటర్‌ప్లాంట్

అనకాపల్లి: మనిషి ఆరోగ్యంలో కీలక పాత్ర పోషించే తాగునీటి సరఫరాలో అడుగుడునా నిర్లక్ష్యమే కనిపిస్తోంది. ఇప్పుడు గుక్కెడు నీళ్లు సైతం వ్యాపారంగా మారిపోవడంతో వాటర్ ప్లాంట్లదారులు ప్రజలను దోపిడీ చేస్తున్నారు. ఒక పక్క భారీగా ధరలు పెంచేస్తున్నప్పటికీ మరో పక్క స్వచ్ఛమైన నీటిని ఇవ్వడం లేదు. నీటిని శుద్ధి చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటోంది. పట్టణ, మండల పరిధిలో 500 మంచినీటి వాటర్ ప్లాంట్లు ఉండగా, అందులో 70 శాతం ఐఎస్ఐ అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారు. వీటిపై జల, వైద్య శాఖల పర్యవేక్షణ ఉండడం లేదు.

నిబంధనలు పాటించడం లేదు...

పట్టణ, మండల పరిధిలో అడుగుకొక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి తాగునీటిని విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారు. ప్లాంట్ నీటిని శుద్ధి చేసేందుకు కొన్ని రసాయనాలను ఉపయోగిస్తున్నారు. అవి ఎంత మోతాదు వాడుతున్నారో తెలియడం లేదు. నీటిని నూరు శాతం శుద్ధి చేస్తున్నామని చెప్పేసి అమ్మేస్తున్నారు. పెద్ద పెద్ద బేవరేజ్ కంపెనీలతోపాటు లోకల్ బ్రాండ్ కంపెనీల ప్లాంట్లలో నిబంధన మేర జరగాల్సిన క్లోరినేషన్ జరగడం లేదు. కొన్ని కంపెనీల వాటర్ బాటిళ్లు, ప్యాకెట్ల నీరు కూడా పూర్తిగా స్వచ్ఛత లేదని ప్రజా ఆరోగ్య సంస్థలు పేర్కొంటున్నాయి. 5, 2, 1, 0.5 లీటరు, 200 ఎంఎల్ వాటర్ బాటిళ్ల పరిమాణంలో మంచి నీటి వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. వాటర్ **ప్యాకెట్లపై తయారీ తేదీలు కూడా లేకుండానే కొన్ని కంపెనీలు పట్టణ పరిధిలో జోరుగా అమ్మకాలు** సాగుతున్నాయి. పూర్తిగా శుద్ధి చేసిన నీటిని తయారీ తేదీకి 30 రోజుల్లోగా వినియోగించాల్సి ఉంది. అసలు మ్యాన్‌ఫ్యాక్చరీ డేటీ వేయడం లేదు. ఇక చారిటీస్ పేర్లతో నడుస్తున్న మినీ ప్లాంట్లలో నీటిని క్లోరినేషన్ స్వచ్ఛత చెప్పనక్కర్లేదు.



వాటర్ ప్లాంట్ వద్ద వాటర్ ట్యాంక్

పని చేయని ఎన్టీఆర్ సుజల స్రవంతి

స్థానిక వేల్పుల వీధిలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ మూడు నెలలుగా పని చేయడం లేదు. జీవీఎంసీ తాగునీటి విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో మూతపడి పోయింది. 20 లీటర్ల టిన్ ఇక్కడ నాలుగు రూపాయలు తీసుకుంటే, ప్రైవేటు వాటర్ ప్లాంట్ నిర్వాహకులు రూ.10 నుంచి రూ.25 వసూలు చేస్తున్నారు. అధికారులకు నెలనెలా మామూలు మత్తులో ఉండడంలో వీటిపై పర్యవేక్షణ లేకుండా పోయింది.

బాటిళ్లపై కనిపించని ఎక్స్‌పెయిరీ డేట్



గాంధీనగరంలో వాటర్ ప్లాంట్ వద్ద టిన్స్

వేసవిలో ఇబ్బంది రాకుండా ప్లాంట్ నిర్వాహకులు ముందుగానే ప్లాస్టిక్ బాటిళ్లు భద్రపర్చుకుంటున్నారు. వీటిపై ఎటువంటి ఎక్స్‌పెయిరీ డేట్ లేకుండా నీటిని నింపి ఉదయం, రాత్రి సమయంలో పాన్‌షాప్‌లు, కిరాణాషాప్‌లు, హోటళ్లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల వద్ద అమ్మకాలు సాగిస్తున్నారు. పట్టణ పరిధిలో కొత్తగా ఇద్దరు వ్యక్తులు విజయనగరం నుంచి బొలేరా వాహనంలో వచ్చి నెలకు మూడు సార్లు రాత్రి సమయంలో అన్‌లోడింగ్ చేస్తున్నారు. దీనిపై ఎటువంటి తేదీలు లేకుండా నెల నుంచి మూడు నెలలు భద్రపరిచి అమ్మకాలు సాగిస్తున్నారు. దుకాణాలకు ఇచ్చే వాటర్ బాటిళ్లకు బిల్లులు ఇవ్వడం లేదని సంబంధిత యజమానులు వాపోతున్నారు.

నీటిలో నలకలు..



పట్టణ పరిధిలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. కొన్ని పరిశుభ్రంగా తాగు నీరు అందిస్తున్నాయని ప్రజలు ఎంతో ఆశతో తీసుకెళ్తే, నీటిలో నలకలు ఉంటున్నాయి. మరలా ప్లాంట్ యాజమానులను ప్రశ్నిస్తే, మీరు తీసుకొచ్చిన వాటర్ టిన్‌లు పరిశుభ్రంగా లేవని దురుసుగా ప్రవర్తిస్తున్నారు. పైగా విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. దీనిపై జీవీఎంసీ తాగునీటి విభాగం అధికారులు, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దినేష్, అనకాపల్లి

మరమ్మతులకు నోచుకోని ఎన్టీఆర్ సుజల స్రవంతి



వేల్పులవీధిలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ నుంచి రోజుకు వెయ్యి మంది ప్రజలు వచ్చి వాటర్ తీసుకెళ్తారు. ఇది మూడు మాసాలుగా పని చేయడం లేదు. దీనిపై జీవీఎంసీ తాగునీటి విభాగం అధికారులు ఎందుకు దృష్టి పెట్టలేదో అర్థం కావడం లేదు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్ యజమానులు ప్రజల నుంచి దోపిడీ చేస్తున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించలేదు.

– కె.హరనాథ్‌బాబు, అనకాపల్లి

అంగన్‌వాడీ సమస్యలపై రాష్ట్రపతికి పోస్టు కార్డులు



రాష్ట్రపతికి రాసిన వినతిపత్రాలను ఆవిష్కరిస్తున్న నాగశేషు

అనకాపల్లి: అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ నెల 3, 4 తేదీల్లో అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, రెగ్యులరైజేషన్ అమలు చేయాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వినతిపత్రాలు పంపిస్తున్నామని జిల్లా ఫెడరేషన్ అధ్యక్షురాలు ఎం.నాగశేషు తెలిపారు. వీటిని ఆమె సోమవారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆవిష్కరించారు. వాటిని పోస్టల్ ద్వారా పంపించామన్నారు. అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్లు, మినీ వర్కర్లను గ్రేడ్–3 నుంచి గ్రేడ్–4కు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 7వ పే కమిషన్ ఏర్పాటు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని తదితర డిమాండ్లను వినతిపత్రంలో రాశామన్నారు. ఫెడరేషన్ జిల్లా నాయకులు దుర్గరాణి, రామలక్ష్మి, భవాని, తనూజ, రమణి, సత్యవేణి, జానకి, మంగ పాల్గొన్నారు.

'రాజకీయ ఒత్తిళ్లతో పింఛన్లు ఇవ్వడం లేదు'

తుమ్మపాల: అర్హులైనప్పటికీ మూడు నెలలుగా సామాజిక పింఛన్లు పంపిణీ చేయకుండా తమను తీవ్రంగా వేధిస్తున్నారని రావికమతం మండలం చినపాసిలి గ్రామానికి చెందిన కొమార వెంకటరమణ, దుర్గనాయుడు, బంగారమ్మ, ముత్యాలమ్మ, పప్పు వెంకటలక్ష్మి, జనపాల వెంకటరమణ, సిద్దా వెంకటలక్ష్మి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పింఛను ఆధారంగా జీవిస్తున్న తమపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి ఏడేళ్లుగా పొందుతున్న పింఛన్లు నిలిపివేసి, తమ కడుపు కొట్టడం దారుణమన్నారు. మూడో నెల పింఛను పొందకపోతే శాశ్వతంగా రద్దు అవుతుందని తెలుసుకుని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



తమ కెరీర్ భావనలు తెలిపేలా వస్త్రాలంకరణతో టెన్త్ విద్యార్థులు



తల్లిదండ్రుల ఆశీస్సులు అందుకుంటున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూలు వార్షికోత్సవంతోపాటు టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టెన్త్ తర్వాత తమ భవిష్యత్ కెరీర్‌ను ఏ రంగంలో రాణించాలని ఆసక్తి చూపుతున్నారో తెలియజేసే వస్త్రాలంకరణతో అలరించారు. తద్వారా డాక్టర్, ఇంజనీర్, నర్స్, సాఫ్ట్‌వేర్, పోలీసు, ఆర్మీ తదితర రంగాల్లో తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలనే తమ భావనలను విద్యార్థులు వెల్లడించారు. వారు ఎంచుకున్న రంగాలకు సంబంధించిన యాంబిషన్ ఐడెంటీ కార్డులను హెచ్‌ఎం ఎ.వి.ఎస్. మూర్తి అందించారు. విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలను సాధించి తమ కలలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. మూడు నుంచి టెన్త్ వరకు చదివే విద్యార్థుల్లో ప్రతిభావంతులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. జాతీయ భావాన్ని నింపే పలు నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. ఎంఈవో–2 కె.ఎస్.ఎన్. మూర్తి, రిటైర్డు హెచ్.ఎం.లు జి.వి.కె. ఆచారి, శిష్ట తమ్మిరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ గణిరెడ్డి శివ, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలుపుతున్న పలు ప్రజా సంఘాలు

కశింకోట: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపులు చేయనందుకు నిరసనగా పలు ప్రజా సంఘాల ప్రతినిధులు సోమవారం తాళ్లపాలెంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమానికి నాయకత్వం వహించిన దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధంగా ఉందని విమర్శించారు. సామాన్యులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఇది ప్రజా, రైతు వ్యతిరేక బడ్జెట్ అన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి గురించిగాని, కడప ఉక్కు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనుల కేటాయింపునకు సంబంధించిన ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజి, విభజన హామీల అమలు తదితర అంశాలపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. ఇటువంటి బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వంతోపాటు రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించి తమ నిరసన కార్యక్రమంలో కలిసి పాల్గొనడానికి రావాలని కోరారు. ప్రజా సంఘాల ప్రతినిధులు వి. బెన్నయ్య, బలరాం, బి. నూకరాజు, గోవింద, బి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకస్వామికి ప్రత్యేక అలంకరణ



పూలమాలలతో శివలింగం అలంకరణ



సరస్వతీదేవి అలంకరణలో సర్వమంగళాంబ

కశింకోట: సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం వసంత పంచమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వమంగళాంబ విగ్రహాన్ని సరస్వతీదేవిగా అలంకరించారు. ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. త్రిపురాంతకస్వామి లింగాకారాన్ని పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు. మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన జరిపారు.

మామిడిపాలెంలో కాలుష్యంపై అధికారుల ఆరా



గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

తుమ్మపాల: అనకాపల్లి మండలం మామిడిపాలెంలో పరిమితులు లేని క్రషర్ల కారణంగా కాలుష్యం పెరిగిపోయి ప్రజలు తీవ్ర వ్యాధుల బారిన పడుతున్నారని చేసిన ఫిర్యాదుల మేరకు సోమవారం వైద్య ఆరోగ్యశాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి కలుషితమైన నీటిని పరీక్షించారు. క్రషర్ల పరిసరాల్లో ఇల్లు, పొలాలు, చెట్లను పరిశీలించారు. గ్రామంలో దుమ్ము, ధూళి ప్రభావాన్ని తనిఖీ చేశారు. తాగునీటి శాంపిల్స్ సేకరించారు. కిడ్నీ వ్యాధులకు గల కారణాలను అన్వేషిస్తున్నామని డీఎంహెచ్‌వో తెలిపారు. గ్రామంపై కాలుష్య పరిస్థితులపై నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. పొల్యూషన్ బోర్డు ఈఈ ముకుందరావు మాట్లాడుతూ క్వారీ, క్రషర్ల నుంచి వెలువడే కాలుష్యాన్ని తనిఖీ చేసామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు చిత్ర లేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీలో విజేత విద్యార్థినులు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో సోమవారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీని ప్రాధాన్యం వివరిస్తూ విద్యార్థినులతో ప్రదర్శన నిర్వహించారు. బాలికలకు చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. సుమారు 50 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు



సూర్యనారాయణస్వామి దేవాలయం

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సూర్యనారాయణస్వామి, సత్యనారాయణస్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రాజసులోచన సోమవారం తెలిపారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో సూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. వెదురుపర్తి, చుట్టు పక్కల గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని అర్చకుడు డి. శంకరరావు తెలిపారు.

ఆలయాల్లో సరస్వతీదేవి పూజలు



స్థానిక రింగ్‌రోడ్డు సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు

అనకాపల్లి టౌన్: వసంత పంచమిని పురస్కరించుకుని పట్టణ, మండలంలో పలు సరస్వతి దేవాలయాల్లో చిన్నారుల సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను సోమవారం వేడుకగా నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సరస్వతి ఆలయాలకు తెల్లవారు జామునే తీసుకువెళ్లి గణపతి పూజ, సరస్వతి, కనకదుర్గ, లక్ష్మీదేవి పూజలు చేశారు. అనంతరం పండితులు చిన్నారులతో ముందుగా బియ్యంలో ఓం నమఃశివాయ రాయించి అనంతరం పలకపై బలపంతో అ, ఆ, ఎ, బి అక్షరాలను దిద్దించారు. ఈ సందర్భంగా చిన్నారులను అర్చకులు ఆశీర్వదించారు. పంచమి రోజున సరస్వతీ దేవిని పూజించిన వారికి ఎంతో పుణ్యం లభిస్తుందని, వసంత పంచమి రోజున చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం వల్ల వారు త్వరగా పురోగమిస్తారని, ఇంట్లో సానుకూల శక్తి ప్రవాహం పెరగడంతో పాటు మనసు ప్రశాంతత కలుగుతుందని ఈ సందర్భంగా అర్చకులు వివరించారు. స్థానిక నెయ్యిలవీధి సరస్వతి ఆలయంలో చిన్నారులు పూజలు చేశారు. కార్యక్రమంలో సరస్వతి ఆలయ ప్రతినిధులు కోడూరు త్రినాథ్ రావు, బి.దక్షాయణి, అర్చకులు పాల్గొన్నారు.

హ్యాపీకిడ్స్ స్కూల్లో....

స్థానిక ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ స్కూల్లో వసంత పంచమి పురస్కరించుకుని చిన్నారులతో సరస్వతి పూజలు చేయించారు. చిట్టిపొట్టి చిన్నారులు శ్రద్ధగా సరస్వతీ దేవి పూజించి, ప్రసాదాలను స్వీకరించారు. సామూహిక అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, చిన్నారులు పాల్గొన్నారు.

విజ్ఞాన భారతి పాఠశాలలో...

స్థానిక గాంధీనగరంలో విజ్ఞాన భారతి పాఠశాలలో వసంత పంచమి పురస్కరించుకుని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి గోప అప్పలాచార్యులు చిన్నారులతో సరస్వతి పూజలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి కన్యకాపరమేశ్వరి శోభాయాత్ర



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం



కన్యకాపరమేశ్వరి అమ్మవారి వెండి రథం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ప్రతిష్ట శతజయంతి ఉత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ప్రతిష్ట శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, శోభాయాత్ర కార్యక్రమం పట్టణ పురవీధుల్లో నిర్వహిస్తామన్నారు.

రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా లోకనాథం, కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా అనకాపల్లికి చెందిన కె.లోకనాథం, జి.కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో నిర్వహించిన సీపీఎం రాష్ట్ర 27వ మహాసభల్లో ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. జిల్లా ప్రజలు పక్షాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తామన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరల నియంత్రించాలని, కార్మిక వ్యతిరేక విధానాలు, పెరుగుతున్న కరెంటు చార్జీలు, నిరుద్యోగ సమస్య, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, రైతులు, కార్మికులు, మహిళల సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

60 మందికి నేత్ర పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్టు రుచిత

కశింకోట: స్థానిక రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. సుమారు 60 మందికి వైద్య సేవలందించారు. విశాఖలోని శంకర్ ఫౌండేషన్ నుంచి హాజరైన ఆప్తాలమిస్టు రుచిత కంటి రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు, కళ్లజోళ్ల కోసం సిఫార్స్ చేశారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ శాంతి, మేనేజర్ చంద్రశేఖర్, రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, కార్యదర్శి కె. కామేశ్వరరావు, కోశాధికారి కానూరి గోపాలరావు తదితరులు సహకారం అందించారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, ఇతరులు శిబిరంలో సేవలు వినియోగించుకున్నారు.